
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5**
ఆదివారం 23 జూన్ 2024



రుణమాఫీపై ఆశలు



- రూ. 2 లక్షల వరకు మాఫీకి కేబినెట్ నిర్ణయం
- 2023 డిసెంబరు 9వ వరకు కటాఫ్ డేట్
- ఆగస్టు 15 వరకు కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు
- జిల్లాలో సుమారు 1.20 లక్షల మంది లబ్ధిదారులు

రూ. 2 లక్షల వరకే వర్తిస్తుంది...

ప్రస్తుత సీజన్ నేపథ్యంలో రైతు సంక్షేమ చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కేబినెట్ మీటింగ్ చర్చించింది. ప్రధానంగా పార్ల మెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం చేసిన రైతు రుణ మాఫీపై కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ, పార్ల మెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2023 డిసెం బరు 9వ తేదీని కటాఫ్ నిర్ణయించింది. ఆ తే దీ వరకు రూ. 2 లక్షల లోపు తీసుకున్న రుణాలను మాత్రమే ఈ రుణ మాఫీ వర్తించనున్నట్లు పేర్కొంది. అది కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లే ఆగస్టు 15 లోపు మాఫీ పూర్తిచేయనున్నట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్రవ్యా ప్తంగా రైతులు తీసుకున్న ఈ రుణాలను మాఫీ చేసేం దుకు రూ. 39 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోనూ దాదాపు 1.20 లక్షలకు పైగా రైతులు లబ్ధిపొందనున్నారు.

జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రుణమాఫీపై అన్నదాతల్లో ఆశలు పెరుగుతున్నాయి. కొంత కాలంగా ఎదురు చూస్తున్న రుణ మాఫీపై ఇప్పటికీ సర్కారు కరుణించింది. అన్నదాతల కు ఏ ఏడాదికి ఆ ఏడాది పంట మీద అప్పు పెరుగుకుంటూ పోయింది. రూ. లక్ష దాటి రూ. రెండు లక్షలకు చేరింది. పండించిన పంటలు పెట్టిన పెట్టుబడికే సరిపోతుండటంతో రుణం కట్టడం కష్టమైంది. ఇప్పుడు సర్కారు ఒకేసారి రూ. రెండు లక్షల రుణం మాఫీ చేస్తామనడంతో ఊపిరి పీ ల్చుకున్నట్లవుతోందని జిల్లా రైతులు అంటున్నారు. రూ. 2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీకి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇటీవల జరిగిన మంత్రి వర్గ కేబినెట్ ఆమోదం తెలుపడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు...

గత ప్రభుత్వం రూ. లక్షలోపు రైతు రుణ మాఫీ చేసింది. కానీ విడతల వారీగా చేపట్టడంతో రుణ మాఫీ ఎప్పుడవుతుంది...అని రైతులు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇందులోనూ కొందరికీ ఇంకా మాఫీ కాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రుణమాఫీ కాకపోవడం, చెల్లించే ప రిస్థితుల్లో లేక పోవడంతో పలువురు రైతులు ఇబ్బందుల పాల య్యారు. ఇక కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనే రూ. 2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పలు పథకాలు ప్రకటించిన గత డిసెంబర్ 9వ తేదీనే రుణ మాఫీ కూడా చేస్తుందని రైతాంగమంతా భావించింది. కానీ భారీ బడ్జెట్ కూడుకుని ఉండటంతో కొత్త సర్కారు సమయం తీసుకుంది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15 లోపు రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని మళ్లీ హామీ ఇచ్చారు. ఈ ప్రకారం ఇప్పుడు రాష్ట్ర కేబినెట్ దీనిపై నిర్ణయం తీసుకుంది.

ఏకకాలంలో మాఫీ....

జిల్లాలో దాదాపు 2.39 లక్షల మంది రైతులు ఉన్నారు. సుమారు 3.90 లక్షల ఎకరాలు పంట భూమి ఉంది. వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు ఎంతో కొంత పంట రుణం తీసుకున్నారు. చాలా మంది అసలు కట్టలేని పరిస్థితుల్లో ఏటా వడ్డీలు కట్టుకుంటూ రుణాన్ని రెన్యువల్ చేయించుకుంటున్నారు. అలా తీసుకున్న రుణానికి వడ్డీ కడుతున్నా... ఏ యేడుకు ఆ యేడు అసలు మాత్రం పెరుగుతూ పోతోంది. రూ. లక్ష నుంచి రెండు లక్షల వరకు చేరిన

ఇప్పటికే బ్యాంకర్ల నుంచి వివరాల సేకరణ...

నిర్దేశించిన కాలంలో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు పొందిన రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు ఇటీవల బ్యాంకర నుంచి సేకరించారు. జిల్లాలో పంట రుణాలు ఇచ్చే బ్యాంకులు పదుల సంఖ్యలో ఉండగా, ఈ బ్యాంకుల బ్రాంచీల ద్వారా రైతులకు రుణాలు అందిస్తున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), ఎస్‌బీఐ, ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితర బ్యాంకులు పంట రుణాలు ఇస్తున్నాయి. జిల్లాలో ఉన్న ఆయా బ్యాంకుల బ్రాంచీలు పంట రుణాల జాబితాలను తయారు చేస్తున్నాయి.

రైతులకు ఇప్పుడు సర్కారు తీపి కబురు చెప్పింది. తాము ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసేందుకు నిర్ణయించింది. అది కూడా ఏకకాలంలో ఈ మొత్తాన్ని మాఫీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది
వాణి, జిల్లా వ్యవసాయ అధికారిణి



పంట రుణాలమాఫీకి అవసరమైన కసరత్తులు జరుగుతున్నాయి. రుణమాఫీ కోసం పలు వివరాలను సేకరిస్తున్నాము. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా రుణమాఫీ అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాము.

సంతోషంగా ఉంది...
వాకిడి సత్యంరెడ్డి, కాంగ్రెస్ కిసాన్ జిల్లా నాయకులు



ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు తీసుకున్న రూ. 2 లక్షల వరకు రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో సంతో షంగా ఉంది. ఇప్పటి వరకు పంట భూమిపై రూ. 2 లక్షల వరకు రుణం ఉన్న రైతులకు మేలు కలగనుంది. ఇప్పుడు ఈ రుణభారం తప్పితే పలువురు చిన్న, సన్న కారు రైతులకు పలు ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి.

పోలీస్ సేవా పతకాలకు ఎంపిక



పతకాలకు ఎంపికైన గంగారాం..సత్తయ్య..వెంకటేశ్వర్ రావు..ప్రకాష్

జగిత్యాల టౌన్, జూన్ 22 : పోలీస్ శాఖలో విశిష్టమైన సేవలు అందించినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలీస్ సేవా పతకాలకు జిల్లా పోలీసులు ఎంపికయ్యారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అలీమోద్దీన్, జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ నసీర్ ఖాన్, జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్ రావు, కథలాపూర్ పోలీస్ స్టేషన్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజశ్రీ, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర ప్రకాష్, రిజర్వ్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు గంగారాం, సత్తయ్యలు సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. విధి నిర్వహణలో భాగంగా కష్టించి పనిచేసే పోలీస్ అధికారులకు మంచి గుర్తింపు వస్తుందన్నారు.

కలెక్టర్‌కు ఘన సన్మానం



కలెక్టర్ సత్య ప్రసాద్‌ను సన్మానిస్తున్న రా రైస్ మిల్లర్లు

జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బుదుమజ్జి సత్య ప్రసాద్‌ను శనివారం రా రైస్ మిల్లర్ల సంఘం జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించడంతో పాటు శాలువతో సత్కరించారు. జగిత్యాల నుంచి బదిలీపై వెళ్లిన కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించడంతో పాటు శాలువ కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో జగిత్యాల జిల్లా రా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూనె శ్రీనివాస్, ఫైలారపు రాంబాబు, నాయకులు దువ్వ రాజు, మల్లారెడ్డి, పెద్ది రాములు, విక్రమ్, లింగ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను సన్మానించిన ఎమ్మెల్యే

జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సత్య ప్రసాద్, జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లు ఘనంగా సన్మానించారు. శనివారం పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో వారిని కలిసి శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో జడ్పీ సీఈఓ రఘువరన్, ఇతరులు పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక అభ్యున్నతికే మహాశక్తి కార్యక్రమం

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్ రావు

జగిత్యాల అర్బన్, జూన్ 22: స్వశక్తి సంఘాల ఆర్థిక అభ్యున్నతికే మహాశక్తి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో ఐకేపీ ఏపీఎంలు, సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంపత్‌రావు మాట్లాడుతూ ఈ మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక పురోగతి కోసం, మహిళల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసి, తద్వారా ఆహార శుద్ధి కేంద్రాలు, క్యాంటీన్లను నెలకొల్పేందుకు కృషి చేస్తుందన్నారు. మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజెస్, మహిళా శక్తి కుట్టు కేంద్రాల ఏర్పాటు, పాడి పశువుల కొనుగోలు, మీ సేవా కేంద్రాల ఏర్పాటు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, మహిళా శక్తి క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ యూనిట్, వ్యవసాయ ఉపకరణాల అద్దె కేంద్రాలు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీడీ చరణ్‌దాస్ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలు, కొత్త సంఘాల ఏర్పాటు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా డీపీఎంలు విజయలక్ష్మీ, మల్లేశం, మనిక్‌రెడ్డి, వెంకటేష్, వనజ, ఏపీయంలు, సీసీలు తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ



మల్యాలలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

మల్యాల, జూన్ 22: కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం మల్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో అన్ని విభాగాలను పరిశీలించారు. రికార్డులు, భూ సమస్యలు, ధరణీ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేస్తూ ప్రజలు ఇబ్బందులు పడకుండా భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధు సూధన్, తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి ఉన్నారు.

బండి సంజయ్‌కి అభినందనలు



బండి సంజయ్‌తో రవీంధర్ రెడ్డి తదితరులు

జగిత్యాల అర్బన్, జూన్ 22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా నియమితులైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి తన అనుచరులతో శనివారంం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, ఆన్‌కార్ సుధాకర్, నల్ల రవి, నారెందుల శ్రీనివాస్, చీటి చంద్రశేఖర్ రావు తదితరులున్నారు.

ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలి

కోరుట్ల పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

కోరుట్ల, జూన్ 22 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు అందించే వారితో సిబ్బంది గౌరవంగా వ్యవహరించి ఫిర్యాదులను తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనీఖీ చేసారు. శనివారం సాయత్రం సమయంలో ఎస్పీ జిల్లా ట్రైనీ ఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి పరిశీలించారు. స్టేషన్‌లో ఉన్న వసతుల వివరాలను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీసారు. స్టేషన్‌లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి భవనాన్ని క్షుణంగా పరిశీలించారు. సిబ్బంది వివరాలను తెలుసుకోని స్వయంగా పరిచయం చేసుకున్నారు. పోలీసుస్టేషన్ పరిధి వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటది వెంట పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరాల నియత్రణపై అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్య వంతులు చేయాలని సూచించారు. సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఎస్పీ అశోక్‌కుమార్‌ను టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు మర్యాద పూర్వకంగా కలిసారు. శనివారం జిల్లా ఎస్పీ ఆఫీస్‌లో ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సుజిత్‌రావు మాట్లాడుతూ నియోజక వర్గంలోని శాంతి భద్రతలతో పాటు పలు అంశాలపై చర్చించామన్నారు.. నాయకులు కూన గోర్ధన్, కల్లెడ గంగాధర్, జలపతిరెడ్డి, మారుతి పాల్గొన్నారు.



కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధి వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ

విద్యాభివృద్ధి కోసం అధికారులు కృషి చేయాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూన్ 22: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు, వసతులు, భోజన సదుపాయం, సమస్యలు, పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించినాదని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కారం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయ కుండా చూడాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీఈవో మాధవి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబు, డీఎం డబ్ల్యువో ఆర్ఎస్ చిత్రూ, ఆర్ఎల్‌సీ కనపర్తి సురేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయ బృందం, మంచిర్యాల వాసవి క్లబ్, ఇతర దాతల సౌజన్యంతో ఏర్పాటు చే సిన ఈ పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఆనందంగా ఉంద ని తెలిపారు. ఇందులో రూ 50,000 విలువ గల 100 స్కూల్ బ్యాగులు, నోట్ బు క్స్ ఖరీదు చేసి విద్యార్థులకు తన చేతుల మీదుగా అందించడం ఉపాధ్యాయుల కృషి, వాసవీ క్లబ్ సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహ కారం అందిస్తుందని ఆయన అన్నారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అ న్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల హెచ్ఎం కె. శ్రీనివాస్, టీచర్లు రావులపెల్లి శ్రీనివాస్, గణేష్, డాక్టర్ గొల్లపల్లి గణేష్, గుండి శంకర్, ముత్యాల దినేష్, సంగనభట్ల సంజీవ్, చంద్రమౌళి, పుష్ప లత, కవిత పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న అడ్లూరి

విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

- తుర్క కాశీనగర్‌లో పాఠశాల ఏర్పాటు
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జూన్ 22 : విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి అనుబంధ గ్రామమైన తుర్క కాశీనగర్ విద్యార్థులు మూడు రోజుల క్రితం నిజామాబాద్ రహదారిపై నడుచుకుంటూ తాటిపల్లి పాఠశాలకు కాలినడకన వెళ్తుండగా చూసి ఎమ్మెల్సీ చలించిపోయారు. కారులో వెళ్తున్న జీవన్‌రెడ్డి ఆగి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జీవన్‌రెడ్డికి తమ సమస్యలను వివరించారు. తమ గ్రామమైన తుర్క కాశీనగర్‌లో పాఠశాల లేకపోవడంతో తాటిపల్లికి వెళ్లి విద్యనభ్యసిస్తున్నామని, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లడం ప్రమాదకరంగా ఉందని జీవన్‌రెడ్డికి వివరించారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న జీవన్‌రెడ్డి..

జగిత్యాల రూరల్ మండలం తుర్క కాశీనగర్ గ్రామానికి చెందిన తాటిపల్లి పాఠశాల వెళ్లే విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం శనివారం గ్రామాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. గ్రామంలోనే పాఠశాల ఏర్పాటు నిమిత్తం గ్రామపెద్దలు, నాయకులతో చర్చించారు. విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం పాఠశాల కోసం గదులను ఏర్పాటు చేశారు. 3 నెలల్లో పాఠశాల భవనం నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా తుర్క కాశీనగర్‌లో పాఠశాలతో పాటుగా అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్సీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో గాయత్రి, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

బాల్యం నుంచే నడవడికను అలవర్చుకోవాలి

జగిత్యాల అర్బన్, జూన్ 22: పిల్లలకు బాల్యం నుంచే పిల్లలు నడవడికను అలవర్చుకోవాలని న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను సందర్శించి పిల్లలతో కలిసి ముచ్చటించారు. పిల్లలకు అందించే ఆహారం నాణ్యమైనదిగా ఉండేలా చూడాలని, కోరారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చంద్రమోహన్, సతీష్, విజయ్‌కృష్ణ, డీఎల్ఎస్ఏ సూపరిండెం ట్ వెంకన్న తదితరులున్నారు.

సివిల్ పరీక్షకు ఉచిత శిక్షణ

జగిత్యాల అర్బన్, జూన్ 22: రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్ హైద్రాబాద్ వారిచే సివిల్ సర్వీసెస్ పరీక్షకు సంబంధించిన ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ఏదైన డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ-ఈ, పీడబ్ల్యూడీ కేటరిగిలకు చెందిన అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత బోధన వసతి సౌకర్యాలతో పాటు, 10నెలల శిక్షణ అందిస్తామన్నారు. వివరాలకు డైరెక్టర్ ఆఫ్ స్టడీ సర్కిల్ 9959264770 సంప్రదించాలని కోరారు.

వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆట



కన్నాపూర్‌లో కప్పతల్లి ఆడుతున్న గ్రామస్థులు

శంకరపట్నం, జూన్ 22: వరుణ దేవుడి కరుణ కోసం మండలంలోని మండలం కన్నాపూర్ గ్రామంలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. గత ఏడాది ఇప్పటికే విత్తనాలు వేశామని, నాట్లు కూడా కొంత మేర పూర్తి చేశామని మృగశిర కార్తి వెళ్లిపోతున్నా భారీ వర్షం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా పడాలని కప్పతల్లి ఆడుతు న్నామని గ్రామస్థులు తెలిపారు. రోకలి బండకు కప్పతల్లిని పసుపుగుడ్డలో కట్టి ఇంటింటికీ తిరిగారు. మహిళలు బిందెలతో నీరు పోస్తూ వరుణుడు కరుణించాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలోని గాయత్రి ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆసుపత్రి భవనం రెండో అంతస్థులో ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆసుపత్రి 2వ అంతస్థులో పేషెంట్లు ఎవరూ లేక పోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా నియంత్రించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 22: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20మంది వాహనదారుల ను శనివారం కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురికి జైలుశిక్షతో పాటు 6 వేల రూపాయలు జరిమానా విధించారన్నారు. మిగతా 17 మందికి 29,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

హుజూరాబాద్, జూన్ 22: హుజూరాబాద్ డివిజన్‌లో ఎస్‌హెచ్‌వోకు దగ్గరగా మెదిలిన ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం తెలిసింది. హుజూ రాబాద్, జమ్మికుంట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుళ్లు అవినాష్, పాషా, జమ్మికుంట రూరల్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే భాస్కర్‌రెడ్డిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే ఆఫీసర్లకు అనుకూలంగా పని చేస్తున్నారని కానిస్టేబుళ్లపై సీపీ ఎస్‌బీ, ఇంటలీజెన్సీ విభాగాల ద్వారా సమాచారం సేకరించి బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

రెండో వివాహం చేసుకున్న ఒకరిపై కేసు

జమ్మికుంట రూరల్, జూన్ 22: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కొండు రవీందర్ రెండో వివాహం చేసుకున్నాడని మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందా పూర్‌కు చెందిన రవీందర్‌కు మంచిర్యాల జిల్లా నస్పూర్‌మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన లతతో 2009లో పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవీందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టుగా పని చేస్తున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి గోవిందాపూర్‌లోనే ఉంటున్నారు. గడిచిన ఏడాది కాలం నుంచి దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి 20న కరీంనగర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఫిబ్రవరి 18న గంగాధర మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సంగీత అనే మహిళను ఎల్ఎండీ కాలనీలోని నర్సింహాస్వామి ఆలయంలో రెండో వివాహం చేసుకున్నాడు. విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకొని తనను, పిల్లలను రోడ్డు మీద పడేసిన భర్తపై మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 22 సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సదన్ కూమార్ శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 19 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్స్, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిత్యం పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని ఎవరైనా గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు, డయల్ 100కి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మేడిపల్లి/భీమారం : మండల కేంద్రం శివారులో పేకాటరాయుళ్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4.50 లక్షల నగదు, ఒక బైక్, ఒక కారు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలిగేడు: జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.16.080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లను జూలపల్లి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్, హెచ్‌సీలు శ్రీనివాస్, మహేందర్, కానిస్టేబుళ్లు శేఖర్, అఖిల్, మల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు, కేటీఆర్.. రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 22: రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏకకాలంలో రైతులకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేయబోతున్నామని ఇక హరీష్‌రావు, కేటీఆర్‌లు రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీఎం నేతృత్వంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రైతుల పక్షాన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలను పరిష్కరించి అండగా నిలిచి రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణ మాఫీ చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిందని మరోసారి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చినదని చేప్పేందుకు ఆరు గ్యారంటీ పథకాల అమలే నిదర్శనమన్నారు. హరీష్‌రావు మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 65 సీట్లతో సుస్థిరంగా ఉందని ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రెండు దశాబ్ధాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగు కాబోతోందన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారంటే వారి అవకాశ వాదానికి అది నిదర్శనమని చెప్పవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించడంతో పాటు పంటల పథకంలో రైతుకు సంబంధించిన ప్రీమియం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు సాగుచేసే సన్నరకాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 చెల్లిస్తామన్నారు. రైతు భరోసా విధి, విధానాల అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టబోతుందన్నారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జగిత్యాల క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విప్, పాల్గొన్న ఎమ్మెల్సీ

రహదారి పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్ 22: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగు శివారులో గతంలో ప్రభుత్వం అటవీశాఖకు 17.34 గుంటల భూమిని కేటాయించింది. గత కొన్ని నెలల నుంచి ఇరుకుల్ల పరిధిలో జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి పనులను చేపట్టారు. ఇరుకుల్ల వాగు శివారులో సమ్మక్క గద్దెల సమీపంలో నుంచి రహదారి నిర్మాణ పనులు నడుస్తుండగా అటవీ భూముల్లో దారి నిర్మిస్తున్నారంటూ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. భూసేకరణ చేపట్టకుండానే తమ భూముల నుంచి రహదారి నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ, ఫారెస్టు, నేషనల్ హైవే అధికారుల సమక్షంలో అటవీభూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ సేవియా నాయక్ ఆధ్వర్యంలో అటవీ భూములను పరిశీలించి ప్రాథమిక సర్వే నిర్వహించారు. మరోసారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తామని డీఐ సేవియా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్ఐ వాస్తవిక్, సర్వేయర్లు సంతోష్, రాకేష్, ఫారెస్టు రేజ్ ఆఫీసరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

జగిత్యాల టౌన్, జూన్ 22: ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో ఇద్దరిపై జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి, ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జగిత్యాలకు చెందిన ముఫీజ్ ఉల్ హక్, వరంగల్‌కు చెందిన ఇంతియాన్ అనే ఇద్దరు వ్యక్తులు రూ. 19 లక్షలు వసూలు చేశారు. రోజులు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని లక్ష్మీదేవి పల్లి గ్రామానికి చెందిన బాధితుడి తండ్రి శంకరయ్య శనివారం జగిత్యాలలో ఉన్న ముఫీజ్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు శంకరయ్యను కులం పేరుతో ముఫీజ్‌తో పాటు అతని భార్య దూషించారు. దీంతో శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానకొండూర్‌లో అదృశ్యం.. కుమరం భీం జిల్లాలో హత్య

● కేసును ఛేదించిన పోలీసులు

మానకొండూర్, జూన్ 22: మానకొండూరులో అదృశ్యమైన యువకుడు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో దారుణంగా హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. మానకొండూరు గ్రామానికి చెందిన అనంతోజు సాయికిరణ్(29) ఏప్రిల్ 18, 2024న భార్య అనూషతో సిద్దిపేటకు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మే 2న మానకొండూరు పోలీసు స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫాంలో అనంతోజు సాయికిరణ్ పనిచేస్తుండగా, దహెగాంకు చెందిన బట్టి సునీత, ఆమె భర్త శ్రీనివాస్ పరిచయమయ్యారు. సునీత, సాయికిరణ్‌తో సాన్నిహిత్యంగా ఉండడంతో ఇరు కుటుంబాల్లో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ భార్య అనూషతో కలిసి మానకొండూరుకు వచ్చి కర్ర మిషన్‌లో పనిచేస్తున్నాడు. సాయికిరణ్ ఏప్రిల్18, 2024న మళ్లీ కోళ్ల ఫాంకు వెళ్లగా సునీత, శ్రీనివాస్ దంపతులతో గొడవ జరిగింది. దీంతో సునీత, శ్రీనివాస్ అదే రోజు దహెగాంకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ ఏప్రిల్ 19, 2024న దహెగాంలోని సునీత, శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి సునీత కుటుంబ సభ్యులు తండ్రి తుమ్మిడి గంగారాం, మేనమామ భీంకరి శ్యాంరావుతో పాటు సునీత, శ్రీనివాస్ కర్రతో సాయి కిరణ్‌పై దాడిచేసి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దహెగాంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని పాడుబడ్డ బావిలో పడవేశారు. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ విచారణలో భాగంగా సునీత, శ్రీనివాస్‌ను విచారించగా హత్య విష యాన్ని అంగీకరించారు. శనివారం సాయికిరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


సాయికిరణ్ (ఫైల్)

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

మల్లాపూర్, జూన్, 22: మల్లాపూర్ మండల కేంద్రంలోని శివారులో శనివారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సబ్‌స్టేషన్ ఎదుట మృతి చెందిన పాడి గేదెలను ఉంచి రైతులు ఆందోళన చేపట్టారు. ట్రాన్స్‌కో లైన్‌మన్ రవిజేతపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఏడీఏకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ శివారులోని గాంధీనగర్‌వాడ సమీపంలోని బర్ల మంద వద్ద ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తెగిపడ్డాయని లైన్‌మన్‌కు నెల రోజులుగా కోరుతున్నామన్నారు. మరోవైపు తెగిపడిన విద్యుత్ తీగలకు కరెంటు సరఫరా అవుతుండటంతో ప్రమాదవశాత్తు రెండు పాడి గేదెలు మృతి చెందాయని తెలిపారు. తెగిన విద్యుత్ తీగలను సరిచేయకపోవడంతోనే రెండు పాడి గేదెలు మృతి చెందాయని ఫోన్ ద్వారా లైన్‌మన్ రవితేజకు తెలుపగా తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఏకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఒక్కో గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరుగడంతో మందుల భూమయ్య చెందిన సీమ పంది విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 22వేలు నష్టం జరిగిందని తనకు న్యాయం చేయాలని విద్యుత్ అధికారులకు బాధితుడు వినతిపత్రం అందజేశారు.


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు

దొంగ కోసం పోలీసుల గాలింపు

మల్యాల, జూన్ 22: వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడైన ఓ దొంగను పట్టుకోవడానికి పోలీసులు శనివారం ఉదయం గాలింపు చేపట్టారు. మండలంలో ఇటీవల ఇళ్లల్లో దొంగతనాలు జరుగడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు శనివారం జగిత్యాల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెలుతున్న ఓ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం వరకు అతన్ని వెంబడించారు. మల్యాల, కొడిమ్యాల పోలీసులు ద్విచక్రవాహనంపై దొంగను అనుసరించడంతో అతను గుర్తించి తన వాహనం వేగాన్ని మరింతగా పెంచి పారిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంలో దొంగ కోసం వెతికినా ప్రయోజనం లేకపోగా త్రుటిలో దొంగ తప్పిపోవడం, వెంటనే సెల్‌ఫోన్ ఆఫ్ చేయడంతో అతను వెళ్లిన మార్గం తెలియనట్లు సమాచారం. దొంగ తప్పించుకోవడంతో పోలీసులు గాలింపు మరింత పెంచినట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య

వేములవాడరూరల్, జూన్ 22: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఎల్లాల తిరుపతిరెడ్డి (48) అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డి తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి మృతితో మతిస్థిమితం కోల్పోయిన తిరుపతిరెడ్డి రెండు నెలల నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తన పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు.


తిరుపతిరెడ్డి (ఫైల్)

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 22: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. జేష్ట శుద్ద పూర్ణమితో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చన లు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రాత్రి వరకు భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి పాల్గొన్నారు.


ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ దాడులు

● స్టేషన్ బెయిల్ కోసం లంచం అడిగిన ఎస్సై ● మధ్యవర్తి అరెస్టు .. ఎస్సై పరారీ

రాయికల్, జూన్ 22: జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. స్టేషన్ బెయిల్ కోసం రాయికల్ ఎస్సై అజయ్ లంచం డిమాండ్ చేయడంతో పక్కా సమాచారంతో అధికారులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఏసీబీ అధికారుల రాకను పసిగట్టిన ఎస్సై తన ఇంటి ఆవరణలోని గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తిని అధికారులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి కథనం మేరకు.. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఈ నెల 11న ఎస్సై తన సిబ్బందితో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ విషయమై స్టేషన్ బెయిల్ కోసం రాజేందర్‌రెడ్డి ఎస్సైని కలువగా రూ. 50 వేలు ఇస్తేనే బెయిల్ ఇస్తానని డిమాండ్ చేశాడు. చివరకు రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. అదే రోజు రూ. 15 వేలు అందజేసి మిగతా డబ్బులను తర్వాత ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం మిగతా డబ్బులు ఎస్సైకి ఇచ్చేందుకు పథకం రూపొందించారు. ఏసీబీ అధికారులతో కలిసి బాధితుడు రూ.10 వేలు ఇచ్చేందుకు ఎస్సైని సంప్రదించగా మధ్యవర్తి పుల్లూరి రాజును కలిసి డబ్బులు ఇవ్వాలని వారికి సూచించాడు. దీంతో రాజేందర్‌రెడ్డి మధ్యవర్తి రాజుకు డబ్బులు ఇచ్చి ఇద్దరూ కలిసి రాత్రి 10 గంటల సమయంలో ఎస్సైకి డబ్బులు ఇచ్చేందుకు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్సై లేకపోవడంతో డబ్బులు తెచ్చామని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్సైకి ఏసీబీ అధికారుల వాహనాలు కనబడడంతో స్టేషన్‌లోని క్వార్టర్స్ గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తి రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఎస్సై కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.


రాయికల్ పోలీస్‌స్టేషన్


రాజు అరెస్టును చూపుతున్న ఏసీబీ అధికారులు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, జూన్ 22: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. వైష్ణవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, వివిఎస్ఆర్ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ముగ్గురు, ట్రినిటీ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ధర్మపురిలో ఒకరు డీబార్ అయ్యారన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన మహిళ

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల డబ్బులు దొంగిలిస్తున్న ఒక మహిళను శనివారం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన జ్యోతి అనే మహిళ 16వ ప్లాట్‌ఫాం వద్ద హుజురాబాద్‌కు చెందిన అనూష పర్సులో నుంచి నగదు, ఏటీఎం కార్డును, మంచిర్యాలకు చెందిన సరళ బ్యాగ్ నుంచి 3 వేల రూపాయలు దొంగిలిస్తుండగా పట్టుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 22 : నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్టు గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన దండుగుల సురేష్ అనే వ్యక్తి మండల పరిధిలోని కోళ్లమద్ది గ్రామానికి చెందిన చీకోటి స్వామిని గల్ఫ్ దేశానికి పంపిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేశాడని తెలిపారు. ఒరిజినల్ పాస్‌పోర్టు, 10 వేల నగదును సురేష్ తమ వద్ద తీసుకున్నాడని బాధితుడు స్వామి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ వెల్లడించారు. సురేష్‌ను శనివారం అరెస్ట్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. స్వామి వద్ద 8 ఒరిజినల్ పాస్‌పోర్టులు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

మూలవాగులో మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జూన్ 22: వేములవాడ మూలవాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మల్లారం రోడ్డులో గల మూలవాగు ఇసుక రీచ్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తిగా గుర్తిం చారు. మృతుడు బ్లాక్ ప్యాంట్, తెల్లటి షర్ట్ ధరించి ఉన్నాడని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదన్నారు. అనుమానాస్పదంగా ఉన్నవారు వేములవాడ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల టౌన్,జూన్ 22: తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తిని గిఫ్ట్‌డీడ్ చేసుకున్న ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బుగ్గారం మండలం శెఖల్ల గ్రామానికి చెందిన ఠాకూర్ గణేష్ సింగ్‌తో పాటు అతని ముగ్గురి సోదరులకు జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో వారసత్వంగా వచ్చిన ఆస్తి ఉంది. గణేష్ సింగ్ సోదరుడు కిసాన్ సింగ్ తప్పుడు పత్రాలు సృష్టించి ఉమ్మడి ఆస్తిని తన భార్య పేరుమీదికి మార్చి ముగ్గురు సోదరులను మోసం చేశాడు. గణేష్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కిసాన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, జూన్ 22: మండలంలోని తక్కళ్లపల్లి శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. గొల్లపల్లి మండలం గుంజపడుగు చెందిన గండం చందు అనే వ్యక్తి టాటా ఏస్ గూడ్స్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని 13క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చందుపై సుమోటో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జగిత్యాల ఇన్‌చార్జి డీపీఆర్‌వోగా లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఇన్‌చార్జీ డీపీఆర్‌వోగా లక్ష్మణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల డీపీఆర్‌వోగా విధులు నిర్వహించిన భీమ్ కుమార్ ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జి. లక్ష్మణ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన జగిత్యాలలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డీపీ ఆర్‌వోగా అదనపు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సమాచార పౌర సం బంధాల శాఖ పనితీరును మరింత మెరుగు పరిచేలా చర్యలు తీసుకుంటానన్నారు.

వివాదాస్పద ప్రభుత్వ భూమి వద్ద పోలీసుల పహారా

కథలాపూర్, జూన్ 22 : మండల కేంద్రంలోని 163 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో శనివారం పోలీసులు ఆ స్థలం వద్ద పహారా కాస్తున్నారు. గ్రామస్థులు ఆ భూమి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందేలా చూడాలని కోరుతున్న క్రమంలో వివాదం కొనసాగుతోంది. మున్నూరు కాపు సంఘం తమకు ప్రభుత్వం గతంలో కేటాయించిందని డాక్యుమెంట్లు చూపుతూ అక్కడ షెడ్లు వేసుకున్నారు. ఆ షెడ్లను గ్రామస్థులంతా కలిసి కూల్చివేసిన క్రమంలో వివాదం రాజుకుంది. కోరుట్ల సీఐ సురేశ్‌బాబుతో గ్రామస్థులు ఆ భూమి ఆలయానికి వాడుకుంటామని చెప్పగా వెంటనే తహసీల్దార్ ముంతాజీబుద్దీన్‌ను సంఘటనా స్థలం వద్దకు పిలిపించారు. జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకుని సమస్య పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు తహసీల్దార్ సూచించారు. సాయంత్రం దాకా పోలీసులు బారికేడ్లు అడ్డుగా వేసి కాపలా కాశారు.

అందుబాటులో ఉండని విద్యుత్ అధికారులు..

ఇబ్బందులో వినియోగదారులు

ఇబ్రహీంపట్నం, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు కరెంట్ కష్టాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నా కొన్ని ప్రాంతాల్లో మాత్రం సీఎం మాట పెడ చెవిన పెడుతున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రాత్రి సమయంలో కరెంట్ కష్టాలు వస్తే ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాల్సిన అధికారులు ఫోన్ ఆఫ్ చేసి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మండలంలోని ఎర్రాపూర్, సత్యక్కపల్లె గ్రా మాల పరిధిలో వారం రోజులుగా నిత్యం రాత్రి పగలు అనే తేడా లేకుండా కరెంట్ కోతలు విధిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. శుక్రవారం రాత్రి 10:45 గంట లకు కరెంట్ పోవడంతో లైన్ ఇన్‌స్పెక్టర్‌కు గ్రామస్థులు ఫోన్ చేశారు. కానీ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో అసలు ఎక్కడ ఏ సమస్య వచ్చింది అనేది తెలుసుకోలేకుండా పోయింది. రాత్రి 2 గంటల వరకు కరెంట్ లేకపోవడంలో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మేడిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మిగతా సిబ్బంది గ్రామంలో విద్యుత్ సమస్యలు తలెత్తి తే ఏఈ, లైన్‌మన్ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా సదరు అధికారి రాత్రి సమయంలో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిన విషయం వాస్తవమేనని ఈ విషయమై పై అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు సమాచారం ఇచ్చేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అంజన్న సేవలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కొండగట్టులో విఠల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

మల్యాల, జూన్ 22: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ విఠల్‌తో పాటు కుటుంబసభ్యులు, సంఘం నేతలు శనివారం కొండ గట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట టీఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శశిధర్, నాగేందర్‌రెడ్డి, సాహిద్, బాబు తదితరులు ఉన్నారు. ఆలయ పర్యవేక్షకులు సునీల్, పరిశీలకులు సంపత్ సంఘ నాయకులను సత్కరించారు.

రహదారి ఆక్రమిస్తున్నారని ఆందోళన

మల్యాల, జూన్ 22: మండలంలోని లంబాడిపల్లి నుంచి దోమలకుంటకు వెళ్లే దారి ఆక్రమణకు గురవుతుందని చర్యలు తీసుకోవాలని లంబాడిపల్లి గ్రామస్థులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గల ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో దోమలకుంటకు చెందిన తిరుమల్, లక్ష్మి అనే వ్యక్తులు బస్సు వెళ్లే దారిని జేసీబీతో లోతు చేస్తున్నారని పేర్కొంటూ తహసీల్దార్ మునీందర్‌కు వినతి పత్రం అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారిని ఆక్రమించడంతో బస్సు ప్రయాణం ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వచ్చి పరిశీలించారని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌ను అభ్యర్థించారు. అదే సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి కలెక్టర్ సత్యప్రసాద్ రాగా వాహనం ఎదుట బైఠాయించారు. తమ సమస్యను కలెక్టర్ పరిస్కరించాలని కోరారు. ఆర్ఐ తిరుపతి, ఇరిగేషన్ అధికారులు కెనాల్ వద్ద గల రహదారి పరిశీలించారు. ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థులు తిరుపతి, మిల్కూరి మల్లారెడ్డి, గుర్రం వెంకన్న, మరాఠి సత్తయ్య, పొన్నం సాయిగౌడ్, గంగారెడ్డి, సురేష్ ఉన్నారు.

జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం

జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంతో పాటు పలు పట్టణాలు, మండలాల్లో సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో గల ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ఇక్కట్లు ఎదుర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 36.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. జిల్లాలోని రాయికల్‌లో అత్యధికంగా 60.2, బీర్‌పూర్‌లో 9.9 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు రికార్డు నమోదైంది. కాగా మేడిపల్లిలో 59.2 ఎం ఎం, జగిత్యాల 51.4 ఎంఎం, జగిత్యాల రూరల్‌లో 50.5 ఎంఎం, కొడిమ్యాలలో 49 ఎంఎం, పెగడపల్లిలో 47.8 ఎంఎం, మల్లాపూర్‌లో 42.4 ఎంఎం, కోరు ట్లలో 41.7 ఎంఎం, గొల్లపల్లిలో 40 ఎంఎం, ఇబ్రహీంపట్నంలో 39.9 ఎంఎం, కథలాపూర్‌లో 39.3 ఎంఎం, మల్యాలలో 36.4 ఎంఎం, ఎండపల్లిలో 33.9 ఎంఎం, మెట్‌పల్లిలో 32.6 ఎంఎం, బీమారంలో 23.9 ఎంఎం, బుగ్గారం 23.6 ఎంఎం, వెల్గటూరులో 20.5 ఎంఎం, సారంగపూర్ 16.5 ఎంఎం, ధర్మపురి 14 ఎంఎం వర్షం కురిసింది. వర్షం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు.

రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం

మల్లాపూర్, జూన్, 22 : రైతులకు పంట రుణాలను మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, తెలంగాణలో రైతు సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు అన్నారు. శనివారం పార్టీకి చెందిన మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన యువ రైతు అనారోగ్యంతో బాధపడుతున్న మానుల బుచ్చిరెడ్డితో పాటు ఇటీవల మరణించిన రైతు చిన్న లింగన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, జలపతిరెడ్డి, రాజేశం, కూన గోవర్ధన్ పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయ వార్షికోత్సవం

మల్యాల, జూన్ 22: మండలంలోని నూకపల్లి అర్బన్ హౌ జింగ్ కాలనీలో గల శ్రీసరస్వతీ ఆలయంలో శనివారం ఆలయ పదవ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సరస్వతి దేవిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.కమలాకర్‌రావు, అంగలి రాజం తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



తాండ్ర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కథలాపూర్, జూన్ 22 : వరంగల్ రైతు డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఏక కాలంలో రు. 2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకున్నారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గంబీర్‌పూర్ సొసైటీ ఆధ్వర్యంలో తాండ్ర్యాలలో నిర్మించిన ఎరువుల గోదాంను ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, సన్న రకం వడ్లకు రు. 500 బోనస్ ప్రకటించిందన్నారు. కేసీఆర్ తన హయాంలోని పదేళ్లలో రుణమాఫీపై ఇచ్చిన మాటను తప్పడం వల్ల రైతులకు వడ్డీలు అసలును మించి పోయాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర సర్కారుపై గత ప్రభుత్వం చేసిన అప్పుల భారంతట్టుకుని రూ. 31 వేల కోట్ల మేర రుణమాఫీకి సిద్ధమైం దన్నారు. రు. 7 లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని కేసీఆర్ కుదేలు చేయగా ఆ భారాన్ని సీఎం ధైర్యంతో తట్టుకుని ముందు కు సాగుతున్నారని చెప్పారు. గతంలో గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతుబంధు ఇచ్చారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు సాగు చేసే రైతులకే రైతుభరోసా ఇచ్చేందుకు కమిటీ వేసిందన్నారు. కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలకు సాగు నీరందించే సూరమ్మ ప్రాజెక్ట్ కాలువలకు సంబంధించిన సర్వేలు ఇప్పటికే పూర్తి చేశామని కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభించి వేలాది ఎకరాలకు సాగు నీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏక కాలంలో రు. 2లక్షల రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొంటూ రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కోఆపరేటివ్ అధికారి సత్యనారాయణ, సింగిల్ విండో చైర్మన్ దాసరి గంగాధర్, వైస్ చైర్మన్ శీలం మోహన్‌రెడ్డి, జడ్‌పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్ రావు, మాజీ సర్పంచ్ గడీల గంగ ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, అల్లూరి దేవన్న, సింగిల్ విండో డైరెక్టర్లు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



మల్లాపూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్ : రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో సంతోషంగా ఆయన చిత్రపటానికి క్షీరా భిషేకం చేశారు. శనివారం మండల కేంద్రంలోని భారతమాత విగ్రహం వద్ద రైతులు సీఎం చిత్రపటం ఏర్పాటు క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పంట రుణ మాఫీ పట్ల తీసుకున్న మార్గదర్శలను హర్షించ విధంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జల పతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, నారాయణ రెడ్డి, జమాల్ పాల్గొన్నారు.

భీమారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు శనివారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు నరేష్ రెడ్డి, మేడిపల్లి మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ వంచన

నిజామాబాద్ ఎంపీ అర్వింద్

కోరుట్ల, జూన్ 22 : మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని కటకం సంఘయ్య కళ్యాణ భవనంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణతో కలిసి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. రైతులకు ఒకే దఫాలో రెండు లక్షల రుణ మాఫీ ఇస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2018 డిసెంబర్ మధ్య రైతులు తీసుకున్న రుణాలకు రుణమాఫీ చేస్తామని చెప్పడం లోట్టపీస్ చర్యగా అభివర్ణించాడు. 2018 కంటే ముందు రైతులకు రుణాలు లేవా... రైతుల వ్యవసాయం చేయ్యడం లేదా... కొత్తగా తయారైన రైతులు ఎవరైనా ఉన్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించాడు.

రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలో ఉత్సాహవంతులు పార్టీ ప్రతిష్ట కోసం పని చేసి వారికి టికెట్లు దక్కుతాయని అన్నారు. నియోజవర్గంలో బీజేపీ నుంచి బరిలో దిగాలనే నాయకులు ఇప్పడి నుంచే గ్రామాలలో ప్రజలను కలుస్తూ ప్రజలలో మమేకం కావాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అందించిన అభివృద్ధి పనులను ప్రజలోకి తీసుకపోవాలని ప్లెక్సీల ద్వార అభివృద్ధి పనుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమాలకు వచ్చే వారికి సన్మానించకుండా నోటు బుక్స్ అందిస్తూ వాటిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మెన్ బోగ శ్రావణి , డాక్టర్ రఘు, రుద్ర శ్రీనివాస్, సుఖేందర్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్

ఎంపీని కలిసిన మండల నాయకులు

మెట్‌పల్లి రూరల్ : నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను మండలంలోని బీజేపీ నాయకులు కలిసారు. రెండవ సారి గెలిచిన తరువాత మొదటి సారి కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించిన ఎంపీని శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి నోటు బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మారు జనార్ధన్ రెడ్డి, జంగిటి శ్రీధర్, ఆకుల శ్రీనివాస్, రాజేశ్వర్‌యాదవ్, బద్దం గంగాధర్, నరసింహారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్, నరేష్, భూమన్న, కిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతుల కోసం ప్రత్యేక కృషి

కాంగ్రెస్ నియజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు



- మొక్కలు నాటుతున్న జువ్వాడి నర్సింగ రావు

కోరుట్ల, జూన్ 22 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో మౌళిక వసుతుల కల్పనకై ప్రభుత్వ దృష్టికి తీసుకపోయి మంజూరయ్యే విధంగా కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో కోరుట్ల యంగ్ మెన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నర్సింగరావు క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన నర్సింగరావుకు ప్రధానోపాధ్యాయుడు భూమయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉన్నత శిఖరాలకు చేరే విధంగా చొరవ చూపాలన్నారు. నూతనంగా ఏర్పడిన యంగ్ మెన్స్ క్లబ్ సభ్యులు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించి పేరు ప్రతిష్టలు సాధించా లన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మీనారా యణ, కాంగ్రెస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, అడెపు మధు, మచ్చ కవిత, గడ్డం వెంకటేష్ గౌడ్, రాజశేఖర్, యంగ్ మెన్స్ క్లబ్ కార్యదర్శి శికారి రామకృష్ణల తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మెట్‌పల్లి: నియోజక వర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కరణకు కృషి చేస్తానని కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నర్సింగరావు అన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలను సందర్శించారు. నిలిచిపోయిన నూతన భవనాన్ని పరిశీలించగా పాఠశాలలో ఎనిమిది మంది టీచర్లకు గాను నలుగురు ఉన్నారని, పలు తరగతి గదులు శిథిల వ్యవస్థలో ఉన్నయని పలు సమస్యలను ఉపాధ్యాయుల తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో పనులు ప్రారంభించినప్పటికీ నేటికి పూర్తి కాకపోవడం చాలా బాధాకరమన్నారు. బీసీ విద్యార్థులు ఎక్కువ ఉన్నందున హాస్టల్ వసతులు, పాఠశాలకు టీచర్లను కేటాయించాలని ఉన్నతాధికారుల కోరడంతో పాటు నియోజవర్గంలోని పాఠశాల, కళాశాల లోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, లింగరెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, భరత్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఇద్దరు సీఐలు బదిలీ

జగిత్యాల టౌన్, జూన్ 22 : జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వేయిటింగ్‌లో ఉన్న కృష్ణారెడ్డిని జగిత్యాల రూరల్ సీఐగా నియమించారు. మెట్‌పెల్లి సీఐగా పనిచేస్తున్న నవీన్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని వేయిటింగ్‌లో ఉన్న నిరంజన్ రెడ్డిని మెట్‌పెల్లి సీఐగా నియమించారు.

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా చిరంజీవి

జగిత్యాల టౌన్, జూన్ 22 : రాయికల్ ఎంపీడీవోగా పనిచేస్తున్న చరింజీవిని జగిత్యాల మున్సిపల్ కమిషనర్(ఎఫ్ఏసీ)గా నియమించారు. ఈ మేరకు కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వలస జీవితాల మెరుగుకు ఐక్యరాజ్య సమితి అనుబంధ సంఘాల కృషి

జగిత్యాల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): వలస జీవితాల మెరుగు కోసం ఐక్యరాజ్య సమితి అనుబంధ సంఘాల కృషి జరుగుతోందని గల్ఫ్ వలస కార్మికుల హక్కుల సంఘం, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోర అధ్యక్షుడు మంద భీంరెడ్డి అన్నారు. శనివారం హైద్రాబాద్‌లో పలువురు గల్ఫ్ జేఏసీ నాయకులు, సంక్షేమ సంఘ సభ్యులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అవసరమైన పలు అంశాలను చర్చించారు. ఈసందర్భంగా మంద భీంరెడ్డి మాట్లాడుతూ కష్టాలతో వలస వెళ్లే నిరుద్యోగుల ఒత్తిడిని తగ్గించడానికి, వలస ఫలితాలను మెరుగు పరచడానికి ఐక్య రాజ్య సమితి అనుబంద విభాగాలయిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్, మైగ్రేషన్ మల్టీ పార్టనర్ ట్రస్ట్ ఫండ్‌లు దృష్టి సారించాయని తెలిపారు. ఇందుకు అవసరమైన అధ్యయనం కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పలువురు గల్ఫ్ వలస కార్మికుల హక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, జూన్ 22: పార్టీ సభ్యత్వం కలిగిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే బీఆర్ఎస్ అండగా నిలుస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త అంకతి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా పార్టీ సభ్యత్వ బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల విలువ గల చెక్కును శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలుస్తున్న పార్టీ ఒక బీఆర్ఎస్ పార్టీ అని, రాష్ట్రంలో 60 లక్షల పైచిలుకు మంది బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారని అన్నా రు. కార్యకర్తల బీమా కోసం దాదాపు రూ.11 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తున్న పార్టీ బీఆర్ఎస్ అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 53 వేల మంది సభ్యులు సభ్యత్వం కలిగి ఉన్నారన్నారు. రూ.2 లక్షలతో ఆర్థికంగా కొంత కుటుంబానికి ఊరట కలుగుతోందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళ కార్యకర్త చంద రాధ ప్రమాదవశాత్తు గాయపడగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రాయికల్ పట్టణంలోని 7వ వార్డుకు చెందిన రాజేందర్‌రెడ్డి తండ్రి కాకర వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ లతికఅనిల్, కో ఆప్షన్ మెంబర్ మహేంద్ర బాబు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మల్యాల: మండల కేంద్రంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని పేర్కొంటూ మండల బీజేపీ నాయకులు శనివారం ట్రాన్స్‌కో ఏఈఈకి ఫిర్యాదు చేశారు. విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు సిబ్బంది నిర్లక్ష్యం మరీ ఇబ్బంది కరంగా మారిందని ఆరోపిస్తూ వినతిపత్రం అందజేశారు. తగు చర్యలు తీసుకోవాలని ఏఈఈని కోరారు.

మెట్‌పల్లి: భారత విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలో జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లో మెట్‌పల్లికి చెందిన విస్‌డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల కరస్పాండెంట్ రామారావు మాట్లాడుతూ ఎన్‌టీఏ స్వయంప్రతిపత్త సంస్థ వారు సెంట్రల్ సెలబస్‌తో జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్షలను ఇటీవల నిర్వహించారన్నారు. పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అరిసె వసుమిత్ర 164వ ర్యాంకు, అరిసె సహజ 184వ ర్యాంకులు, జాతీయ స్థాయిలో 921 ర్యాంక్‌తో ప్రతిభ కనబరిచారన్నారు.

భీమారం: మండల కేంద్రానికి చెందిన ద్యావనపెల్లి విజయ్ కుమార్(34) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విజయ్ కుమార్‌కు శాన్వి, ధనుశ్రీ, రాజ్‌వీర్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు కమ్ముకున్నాయి.

మెట్‌పల్లి: మెట్‌పల్లిలోని 1వ వార్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భవన ప్రహరీ కూలి పోయింది. శనివారం మున్సిపల్ కమిషనర్ మోహన్ ఆదేశాల మేరకు కూలిన ప్రహరీని తొలగించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల ప్రహరీ శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కూలి పక్కన ఉన్న మురికి కాలువ, రోడ్డుపై పడింది. దీంతో రోడ్డుపై రాకపోకలకు ప్రజలు ఇబ్బందిగా ఉందని పలువురు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వెంటనే సిబ్బంది కూలిన ప్రహరీ గోడను తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణ శివారులోని మహాలక్ష్మీ, మరెమ్మ, మడాలయ దేవాలయ వద్ద మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆదేశాలతో పారిశుధ్య కార్మికులు శనివారం పారిశుధ్య పనులను చేపట్టారు. ఆషాడ మాసం పురస్కరించుకొని దేవాలయ వద్ద జరిగే వేడుకలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలను చేపట్టారు. దేవాలయానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై తాత్కాలికంగా రహదారిని ఏర్పాటు చేశారు.

బుగ్గారం: మండల కేంద్రం నుంచి వెల్గొండ గ్రామం వరకు మట్టి రోడ్డు నిర్మించాలని బుగ్గారం కుమ్మరి సంఘ సభ్యులు శనివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా విప్ ఎమ్మెల్యే అడ్లూరి త్వరలో రైతుల కోరిక మేరకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎన్నికైన కుమ్మరి సంఘం అధ్యక్షుడికిని శాలువతో విప్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కోడిమ్యాల రాజన్న, నాయకులు కోడిమ్యాల శ్రీధర్, సిరికొండ శివ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి రెండు రోజుల క్రితం మృతి చెందగా ఆయనను పరామర్శించి సంతాపం ప్రకటించారు.

కోరుట్ల: పట్టణంలోని పలు ప్రాంతాలలో ఈ నెల 23 వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ట్రాన్స్ కో టౌన్ ఏఈ 2 సత్యనారాయణ శనివారం తెలిపారు. పట్టణంలోని బిలాల్‌పుర, రాంనగర్, ఎస్కోని గుట్ట, వేములవాడ రోడ్డు ప్రాంతాలలో నేటి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు. వినియోగదారులు సహకారం అందించాలని ఏఈ కోరారు.

కొడిమ్యాల: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కొడిమ్యాల మండల బీజేపీ ఉపాధ్యక్షుడు చల్ల శ్రీనివాసరెడ్డి. బొక్కెన అరుణ్‌కుమార్ శనివారం కరీంనగర్ ఎంపీ కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించారు. కొడిమ్యా ల మండల అభివృద్ధితో పాటుగా మండలంలోని శ్రీ రాములపల్లి, తిప్పయ్యపల్లి గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని హోం శాఖ సహాయ మంత్రిని కోరినట్లు వారు తెలిపారు.

మెట్‌పల్లి: పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. శనివారం పట్టణంలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి రూ. 4వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్లాస్టిక్ కవర్స్ వాడొద్దని, జ్యూట్ బ్యాగులు వాడాలని సూచించారు. హోటల్స్‌లోని కిచెన్ లోపల పరి శుభ్రత పాటించాలన్నారు. హోటల్స్ నుంచి వెలువడిన చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఇన్‌చార్జి సానిటర్ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, జూనియర్ అసిస్టెంట్ రవీందర్, ముజీబ్, నాయక్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్ : కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను శనివారం కథలాపూర్ బీజేవైఎం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కరీంనగర్‌లోని తన స్వగృహంలో జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి, కాశోజి ప్రతాప్, జిల్లా దళిత మోర్చా నాయకుడు ప్రవీణ్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.